సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



గర్భిణిని డోలీలో తరలింపు

పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. 8లో



ముందస్తు చర్యలతో నష్ట నివారణ

విపత్తుల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా నష్టాలను నివారించవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. 8లో



మెరుగైన వైద్యం అందించాలి

వైద్యాధికారులు నిర్లక్ష్యం చేయకుండా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

- మినుములూరులో 18, చింతపల్లిలో 19.5 డిగ్రీల నమోదు



పాడేరు-జి.మాడుగుల రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గుముఖం పడుతున్నాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 18 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 19.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మబ్బు వాతావరణం వల్ల మూడు రోజుల నుంచి కనిపించని పొగమంచు శనివారం దట్టంగా కురిసింది. పాడేరు, అరకు లోయ, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతాల్లో ఉదయం 7 గంటల వరకు కురిసింది. హెడ్‌లైట్ల వెలుగులో వాహన చోదకులు రాకపోకలు సాగించారు. మధ్యాహ్నం నుంచి మబ్బు వాతావరణం నెలకొంది.

రాజ్యాంగం అమలుతీరుపై పరిశోధన పత్రం సమర్పణ



అంతర్జాతీయ సదస్సుకు హాజరైన అధ్యాపకుడు డాక్టర్ రమేష్‌బాబు

పాడేరు : వికసిత్ భారత్ 2047 అంతర్జాతీయ సదస్సులో రాజ్యాంగం అమలుతీరుపై పరిశోధన పత్రాన్ని సమర్పించినట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ వి.రమేష్‌బాబు తెలిపారు. ఈనెల 18,19 తేదీల్లో రాజస్థాన్‌లోని బికనీర్ నగరంలో జరిగిన అంతర్జాతీయ సెమినర్‌లో ఆయన హాజరయ్యారు. 78 సంవత్సరాల భారత రాజ్యాంగ అమలు తీరుపై సదస్సులో ప్రసంగించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయ్, సహచర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

కేజీబీవీ పోస్టులకు దరఖాస్తులు వెల్లువ

- 42 ఉద్యోగాలకు 436 స్వీకరణ
- 80 శాతం మేర పరిశీలన పూర్తి



మహిళా అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో బోధన, బోధనేతర పోస్టులకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. 42 పోస్టులకు గాను మహిళా అభ్యర్థుల నుంచి 436 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఈవో బ్రహ్మాజీరావు, ఇతర అధికారులు అభ్యర్థుల సమక్షంలో వీటిని పరిశీలించారు. మరో 20 శాతం దరఖాస్తులను ఆదివారం పరిశీలిస్తామని డీఈవో తెలిపారు.

లోతుగెడ్డ ఆశ్రమ పాఠశాల సందర్శన

- విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



లోతుగెడ్డ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శనివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన, వసతి, భోజన సౌకర్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం వంట గదులను పరిశీలించారు. ప్రాథమిక స్థాయి నుంచి భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్‌ను ఆదేశించారు.





అహో.. మహోదయం

ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి హిల్స్‌కు శనివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. సూర్యోదయం, మంచు, మేఘాల అందాలను వీక్షించి మురిసిపోయారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మత్స్యగెడ్డ సమీపంలో కొండలను కమ్మిన మేఘాలు, పొగమంచు అందాలు కనువిందు చేశాయి. – సాక్షి,పాడేరు/పెదబయలు

SUNDAY SPECIAL

వెండితెరపై.. ఏవోబీ అందాలు



ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని ప్రకృతి అందాలు సినీ దర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో ముఖ్య సన్నివేశాల చిత్రీకరణకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. మరోపక్క కొద్దిరోజులుగా సినీ చిత్ర బృందాల రాకతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది.

- తరలివస్తున్న చిత్ర యూనిట్లు
- ప్రకృతి అందాలకు నెలవుగా సరిహద్దు ప్రాంతం
- మౌలిక సదుపాయాలు కల్పిస్తే మరింత ఆదరణ



మత్స్యగెడ్డ ఒడ్డున షూటింగ్ సందడి



సినిమా షూటింగ్‌లు జరిగే డుడుమ జలపాతం పరిసరాలు



మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రం వించ్‌లో ప్రయాణిస్తున్న విలక్షణ నటుడు జగపతిబాబు



హీరో అల్లరి నరేష్, హీరోయిన్ ఆనందిపై మత్స్యగెడ్డ ఒడ్డున చిత్రీకరణ

సినిమా షూటింగ్‌లతో నిత్యం సందడి

ముంచంగిపుట్టు: మన్యంలో ప్రకృతి అందాలకు నెలవు ఏవోబీ ప్రాంతం. ఒక వైపు దీవులను తలపించేలా జోలాపుట్టు జలాశయ అందాలు.. మరోపక్క ఆకర్షణీయమైన సుందర ప్రదేశాలు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు సినీ దర్శకుల దృష్టి కూడా ఈ ప్రాంతాల వైపు మరలింది. దీంతో ముఖ్యమైన సన్నివేశాల చిత్రీకరణకు ఇక్కడికి తరలివస్తున్నారు.

చిత్రీకరణ జరిగే ప్రదేశాలు

- జోలాపుట్టు జలాశయం ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో సుమారు 238 గ్రామాల పరిధిలో విస్తరించి ఉంది. జలాశయం మధ్యలో కొండలు, మట్టి దిబ్బలు దీవులను తలపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో సినిమా సన్నివేశాల చిత్రీకరణకు దర్శకులు ప్రాధాన్యమిస్తున్నారు.

కట్టిపడేస్తున్న మత్స్యగెడ్డ అందాలు

జలవిద్యుత్ ఉత్పత్తికి నీరందించే వనరుల్లో కీలకమైన మత్స్య గెడ్డ అందాలు వర్ణనాతీతం. మెలికలు తిరుగుతూ ఎత్తయిన గిరుల మధ్య నుంచి ప్రవహించే పాయలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటితో పాటు మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్ వించ్ ప్రయాణం, డుడుమ జలపాతం అందాలు సినీ దర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. దీంతో ప్రముఖ డైరెక్టర్లు, ఫొటోగ్రాఫర్లు, లొకేషన్ మేనేజర్లు ఈ ప్రాంతానికి వచ్చి లొకేషన్లను తమ కెమెరాల్లో బంధించి తీసుకువెళ్తున్నారు.

చిత్రీకరించిన సినిమాలు

- 2021లో హనుమాన్ సినిమా షూటింగ్ జరిగింది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో హీరోగా తేజ సజ్జా, హీరోయిన్‌గా అమృత అయ్యర్‌పై పలు పాటలు, సన్నివేశాలను సుజనకోట ప్రాంతంలో చిత్రీకరించారు.
- 2022లో 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' సినిమాలో కొన్ని సన్నివేశాలను ఈ ప్రాంతంలో మూడు రోజులపాటు చిత్రీకరించారు. హీరో అల్లరి నరేష్, హీరోయిన్ ఆనందిపై మత్స్యగెడ్డ ఒడ్డున పాటలోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు.
- 2023లో ఏవోబీ సరిహద్దు ప్రాంతమైన వంతాల ఘాట్‌లో పుష్ప–2 సినిమాకు సంబంధించి దర్శకుడు సుకుమార్ లారీ చేజింగ్ సన్నివేశాలను తీశారు.
- ప్రస్తుతం రెండు వారాలుగా మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం పరిసరాల ప్రాంతాల్లో ప్రముఖ సినీ డైరెక్టర్ జాగర్లమూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో ఘాటీ సినిమాలో సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ హీరోయిన్ అనుష్క శెట్టి, విలక్షణ నటుడు జగపతిబాబు, జాన్ విజయ్‌లపై సన్నివేశాల చిత్రీకరించారు.

మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు

ఏవోబీలో సినిమా సన్నివేశాల చిత్రీకరణకు వస్తున్న యూనిట్ బృందాలు, సభ్యులు, నటీ నటులు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకంగా ఈ ప్రాంతానికి ఎంతో గుర్తింపు ఉంది. సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఈ ప్రాంతంలో సౌకర్యాలు లేవు. కనీసం రెస్టారెంట్లు, కాటేజీలు కూడా అందుబాటులో లేవు. దీంతో సినిమా చిత్రీకరణకు వచ్చేవారు ఒడిశాలోని జైపూర్, జిల్లాలోని అరకు, పాడేరులో రాత్రి బస చేయాల్సి వస్తోంది. ప్రతిరోజు సుమారు 50 నుంచి 70 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తోంది. సినిమా చిత్రీకరణ బృందాలు, పర్యాటకులకు అనువుగా సౌకర్యాలు కల్పిస్తే ఈప్రాంత ప్రకృతి అందాలు ప్రాచుర్యం పొందుతాయి. అంతేకాకుండా సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తాయని పలువురు సూచిస్తున్నారు.

గోవాకు మించి లోకేషన్లు



కేరళ, గోవాలో మాత్రమే సినిమా షూటింగ్‌కు మంచి లోకేషన్లు ఉన్నాయని అందరూ అనుకుంటారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతమైన మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో కూడా చాలా అందమైన లోకేషన్లు ఉన్నాయి. ఎత్తయిన కొండల మధ్య మత్స్యగెడ్డ ఒంపులు తిరుగుతూ ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ ఎంతగానో ఆకట్టుకుంది.

– జాన్ విజయ్, ప్రముఖ సినీ నటుడు

అందాలు అద్భుతం



ఏవోబీలో ప్రకృతి అందాలు అద్భుతంగా ఉన్నాయి. డుడుమ జలపాతం, మాచ్‌ఖండ్ వించ్ హౌస్‌లో ప్రయాణం మధురమైన అనుభూతి ఇస్తున్నాయి. ఈప్రదేశంలో వారం రోజులు మాత్రమే సన్నివేశాలు చిత్రీకరించాలని అనుకున్నాం. ఇక్కడి అందాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నందున ముఖ్యమైన సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరిస్తున్నాం.

– జాగర్లపూడి రాధాకృష్ణ (క్రిష్), ప్రముఖ సినీ దర్శకుడు



కొండల మధ్య మెలికలు తిరుగుతూ ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



ఆకట్టుకుంటున్న మత్స్యగెడ్డ పరిసరాలు

భూసార పరిరక్షణతో రైతులకు మేలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- సూక్ష్మ ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం
- రూ.800 కోట్ల మేర వ్యవసాయ రుణాలు
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జీవ వైవిధ్యంతో భూసార పరిరక్షణ సాధ్యమని, తద్వారా గిరిజన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం వాసన్, రేయి ఫారెస్ట్ ఎలియన్స్, రైతు సాధికార సంస్థల ఆధ్వర్యంలో జీవ వైవిధ్య సుస్థిర వ్యవసాయం, భూవనరుల యాజమాన్య పద్ధతులపై వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి క్షీణతకు సంబంధించిన సమస్యలు, సవాళ్లను అధిగమించాలని సూచించారు. సూక్ష్మ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ఆర్‌వోఎఫ్‌ఆర్ భూముల్లో డ్వామా ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేపింగ్ పనులు నిర్వహించాలన్నారు. జిల్లాలో రూ.800కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేస్తున్నామని, రైతులంతా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పంటల సాగు సమగ్ర సమాచారం నమోదుకు సచివాలయ సిబ్బందితో కమిటీలు వేయాలని, నీటి సంరక్షణ పనులకు ఇద్దరు రిసోర్స్ పర్సన్లను నియమించాలని సూచించారు. సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపడుతున్న భూసార పరిరక్షణ,ల్యాండ్ స్కేపింగ్ పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.ఈ కార్యక్రమానికి వర్చువల్ విధానంలో పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, కె.సింహాచలం పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయాధికారి నందు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, డ్వామా పీడీ శివయ్య, నాబార్డు డీడీ ఎం.చక్రధర్, రైతు సాధికార సంస్థ డీపీఎం భాస్కరరావు, వాసన్, రెయిన్ ఫారెస్ట్ ఎలయన్స్ ప్రతినిధులు వినూత్న, సౌమిత్ర, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ సన్ని పాల్గొన్నారు.

ఘాటీ చిత్ర బృందం అత్యుత్సాహం

- ప్రాజెక్ట్‌లో చిత్రీకరణకు ప్రయత్నం
- అడ్డుకున్న ఎస్‌ఈ సుబ్రమణ్యేశ్వరరావు



జల విద్యుత్ కేంద్రంలో చిత్ర బృందం

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలోని జనరేటర్ల వద్ద షూటింగ్ చేసేందుకు ప్రయత్నించిన ఘాటీ చిత్ర యూనిట్ బృందాన్ని ప్రాజెక్ట్ ఎస్‌ఈ ఏవీ సుబ్రమణ్యేశ్వరరావు అడ్డుకున్నారు. మాచ్‌ఖండ్ పరిసర ప్రాంతాల్లో గత రెండు వారాలుగా క్రిష్ దర్శకత్వంలో అనుష్కశెట్టి కథానాయికగా ఘాటీ సినిమా షూటింగ్ జరుగుతోంది. దీనిలో భాగంగా శనివారం ఉదయం చిత్ర బృందం అత్యుత్సాహం ప్రదర్శించింది. విద్యుత్ కేంద్రంలోని జనరేటర్లు వద్దకు వెళ్లి సినిమా షూటింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. దీనిని గమనించిన ప్రాజెక్టు ఎస్‌ఈ అడ్డుకున్నారు. సినిమా చిత్రీకరణకు కేవలం మాచ్‌ఖండ్ పరిసర ప్రాంతాలకు మాత్రమే అనుమతి ఉందని, విద్యుత్ కేంద్రంలో చిత్రీకరణకు ఎటువంటి అనుమతి లేదని దర్శకుడు క్రిష్‌కు ఎస్‌ఈ స్పష్టం చేశారు. వెంటనే బయటకు వెళ్లిపోవాలని సూచించారు. దీంతో చేసేది ఏమీ లేక చిత్ర బృందం వెనుదిరిగింది.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడా పాఠశాల విద్యార్థుల ఎంపిక

అభినందించిన ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ శ్రీనివాసరావు

అరకులోయ రూరల్: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు అరకులోయ క్రీడా పాఠశాలకు చెందిన కిల్లో ఏలియ్య, జన్ని వినయ్, అశోక్‌కుమార్ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 20న నర్సీపట్నంలో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్, కోచ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. మరింత ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

మన్యం కాఫీ ఖ్యాతి మరింత పెంపునకు కృషి

- 2 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- జీసీసీ ఎండీ కల్పనాకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జీసీసీ ఎండీ కల్పనాకుమారి

చింతపల్లి: మన్యం కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉందని దీన్ని గిరిజన సహకార సంస్థ ద్వారా మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు గిరిజన రైతులంతా సహకరించాలని జీసీసీ ఎండీ కల్పనాకుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలసి చింతపల్లిలో జీసీసీ, ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈఏడాది కాఫీకి జీసీసీ ద్వారా మంచి గిట్టుబాటు ధరలను ప్రకటించామన్నారు. కిలో పార్చిమెంటు ధర రూ.285 , చెర్రీ ధర కిలో రూ.150 రొబస్టా కిలో రూ.80గా నిర్ధారించినట్టు చెప్పారు. ఈఏడాది రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీని జీసీసీ ద్వారా గిరిజన రైతులనుంచి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైతులు నాణ్యతపై కూడా దృష్టి పెట్టేలా వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కాఫీ బోర్డు, ఐటీడీఏ ద్వారా రైతులకు అవసరమైన యంత్రాలు, పరికరాలను రాయితీపై సరఫరా చేస్తున్నట్టు పీవో అభిషేక్ వెల్లడించారు. అనంతరం ఎండీ, ఐటీడీఏ పీవోతో కలసి చింతపల్లిలోని మ్యాక్స్ ఆధ్వర్యంలో నెలకొల్పిన కాఫీ పల్పింగ్ యూనిట్‌ను పరిశీలించారు. రైతుల కాఫీ తోటలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ కాఫీ విభాగం ఏడీ ఏడీ అశోక్, జీసీసీ డీఎంలు దేవరాజ్, సింహాచలం, జీసీసీ బ్రాంచి మేనేజర్లు మురళీకృష్ణ, విజయ్‌కుమార్, శ్రీనివాస్, మ్యాక్స్ అధ్యక్షుడు సెగ్గె కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంపద తయారీ కేంద్రాల పరిశీలన



లబ్బంగిలో సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లి: ఘన సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాడేరు డీఎల్‌పీవో కుమార్ అన్నారు.ఆయన శనివారం చింతపల్లి మండలంలోని లంబసింగి పంచాయతీలో పర్యటించారు. సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం లబ్బంగిలో సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట చింతపల్లి ఈఓపీఆర్డీ శ్రీనివాస్ ఉన్నారు.

సీలేరులో స్వచ్ఛభారత్

సీలేరు: సీలేరులో సీఆర్‌సీఎఫ్ 42–బెటాలియన్ ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ 42–బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ వికాస్ పాండ్యన్ పర్యవేక్షణలో శివాలయం వద్ద ఉన్న పిచ్చిమొక్కలను, ప్లాస్టిక్ సీసాలను, పాలిథిన్ కవర్లను తొలగించారు. పర్యాటక ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో గుంటవాడ జలాశయం, శివాలయం వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సీఆర్‌పీఎఫ్ 42–బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ వికాస్ పాండ్యన్ తెలిపారు. సరిహద్దుల్లో భద్రతతో పాటు గ్రామాల్లో పరిశుభ్రత తమ విధి నిర్వహణలో ఒక భాగమేనన్నారు.

పంటల విస్తీర్ణం పెంపునకు చర్యలు

చింతపల్లి: గిరిజన రైతాంగం రబీలో పంట విస్తీర్ణాన్ని పెంచే విధంగా వ్యవశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని వ్యవశాయ పరిశోధన స్థానం ఏడీఆర్ అప్పలస్వామి అన్నారు. పరిశోధన స్థానంలో మూడు మండలాల వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలుతో నెలవారీ సమీక్ష సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట కోత అనంతరం ఆదాయాన్నిచ్చే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రబీ సీజన్‌లో పొద్దుతిరుగుడు, శనగ, గోదుమ తదితర పంటల సాగుపై పరిశీలించనున్నట్టు తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారి ఖర్ల మాట్లాడుతూ తమ శాఖ ద్వారా మామిడి, పైనాపిల్, డ్రాగన్‌ఫ్రూట్, మిరియాలు, జీడి మామిడి పంటలకు సంబంధించి ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలను వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ వెంకటేష్‌బాబు, సందీప్‌నాయక్, జోగారావు, పాడేరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ పి.ప్రదీప్‌కుమార్, వ్యవసాయ సహసంచాలకులు కంతా జాహ్నవి, చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండల వ్యవసాయాధికారులు శ్రీనివాసరావు, మధుసూదనరావు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీసా.. పాత మందు..!

నూతన మద్యం పాలసీ పేరుతో కూటమి దగా



- ఇప్పటికీ అందుబాటులోకి రాని రూ.99 చీప్ లిక్కర్
- జిల్లాలో 155 మద్యం దుకాణాల్లో ప్రస్తుతానికి 116 మాత్రమే ఏర్పాటు
- షాపులు దొరక్కా ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు
- పైసా కూడా తగ్గించకపోగా.. ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మకాలు

విశాఖ సిటీ: సీసా మాత్రమే మారింది. అందులో పాత లిక్కరే ఉంది. రూ.99కే క్వార్టర్ చీప్ లిక్కర్ అని ఊదరగొట్టారు. ఆ మాయ మాటలు విని మందుబాబులు ఎగిరి గంతేశారు. ఇప్పుడు మద్యం ధరలు తగ్గకపోగా.. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతోంది. చవకగా బ్రాండెడ్ మద్యం వచ్చేస్తుందన్న ఆశలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. మద్యంపై పైసా కూడా తగ్గించకపోగా.. కొత్త బాటిళ్లలో పాత మద్యాన్నే అందిస్తోంది. కేవలం 'ప్రైవేటు'కు మేలు చేయడానికే కొత్త మద్యం పాలసీ ప్రవేశపెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

షాపుల కోసం వెతుకులాట

లాటరీలో మద్యం దుకాణాన్ని దక్కించుకోవడం కంటే.. దుకాణం ఏర్పాటుకు షాపు దొరకడమే కష్టంగా మారింది. సిండికేట్లు మాత్రం లాటరీకి ముందే కొంత మంది ఎక్సైజ్ అధికారుల సహకారంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు నిర్వహించే షాపులను లీజులకు తీసుకున్నారు. మిగిలిన వారు మాత్రం మద్యం దుకాణం వచ్చి వారం రోజులైనా ఇంకా షాపుల వెతుకులాటలోనే ఉన్నారు. జిల్లాలో 155 షాపులకు గాను ప్రస్తుతం 116 మాత్రమే ఏర్పాటయ్యాయి. మిగిలిన 39 మంది షాపుల కోసం ప్రయత్నిస్తున్నారు. కొన్ని చోట్ల షాపులను లీజుకు మాట్లాడుకున్నప్పటికీ.. కూటమి నేతల షాపులకు సమీపంలో ఉన్నాయన్న కారణంతో షాపు యజమానులపై ఒత్తిడి చేస్తున్నారు. తమ అనుచరులనే స్థానిక ప్రజలుగా పంపించి నిరసనలు చేయించి.. షాపులు దొరక్కుండా చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. కైలాసపురం ప్రాంతంలో ఒక టీడీపీ నేతకు సంబంధించిన బార్‌కు కొంత దూరంగా వైన్‌షాపు కోసం ఏర్పాట్లు చేస్తుండగా.. శనివారం దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఇలా అనేక చోట్ల టీడీపీ నేతలకు సంబంధించిన వైన్‌షాపులు, బార్లు ఉన్న ప్రాంతాల్లో కొత్త వారు షాపులు ఏర్పాటు చేయకుండా అడ్డుతగులుతున్నారు.

సిండికేట్ల కోసమే..

సిండికేట్లను పెంచి పోషించడానికే కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకువచ్చినట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 133 మద్యం షాపులు ఉంటే.. కూటమి ప్రభుత్వం ఆ సంఖ్యను 155కు పెంచింది. వీటికి ఈ నెల 2వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా.. 4,139 మంది పోటీ పడ్డారు. ఇందులో 80 శాతం దరఖాస్తులు సిండికేట్ల నుంచే రావడం విశేషం. ఒక్కో దుకాణానికి 5 నుంచి 15 దరఖాస్తులు సమర్పించారు. దీంతో 100 వరకు వైన్‌షాపులు ఈ సిండికేట్ల చేతుల్లో ఉన్నాయి. అలాగే కూటమి ప్రజాప్రతినిధుల అనుచరులు మరో 30 షాపుల వరకు చేజిక్కించుకున్నారు. ఈ నెల 14వ తేదీనే లాటరీ ప్రక్రియ ముగియగా.. ఆ మరుసటి రోజే 155 మంది లైసెన్సు ఫీజు చెల్లించినప్పటికీ.. ఇప్పటికీ జిల్లాలో పూర్తి స్థాయిలో వైన్‌షాపులు ఏర్పాటు కాలేదు.

రూ.99 లిక్కర్ ఊసేలేదు..

అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.99కే క్వార్టర్ చీప్ లిక్కర్ అందిస్తామని చంద్రబాబు ఊదరగొట్టారు. ఎన్నికల ప్రచారాల్లో రాష్ట్రాభివృద్ధికి, విశాఖ ప్రగతికి, ప్రజా సంక్షేమం కోసం కంటే.. లిక్కర్‌నే ప్రధాన ప్రచారాస్త్రంగా చెప్పుకుంటూ వచ్చారు. దీంతో మందుబాబులు కూడా తక్కువ ధరకే క్వార్టర్ మద్యం వస్తుందని ఆశపడ్డారు. కానీ కొత్త మద్యం పాలసీ వచ్చేసింది. కొత్త వైన్‌షాపులు ఏర్పాటవుతున్నాయి. కానీ ఇప్పటి వరకు రూ.99 చీప్ లిక్కర్ ఊసెత్తడం లేదు. చాలా మంది మందుబాబులు ఈ లిక్కర్ కోసం వైన్‌షాపుల చుట్టూ ప్రతి రోజూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. కానీ ఆ క్వార్టర్ మద్యం వస్తుందో? రాదో? తెలియదని వ్యాపారులు సమాధానమిస్తున్నారు. ఇదిలా ఉంటే ఎక్సైజ్ అధికారులకు కూడా ఈ రూ.99 చీప్ లిక్కర్‌పై ఎటువంటి సమాచారం లేకపోవడం గమనార్హం.

కొత్త వైన్‌షాపుల్లో పాత మద్యమే..

గత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన మద్యం దుకాణాల్లో విక్రయించిన మద్యంపై కూటమి నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. నాణ్యతలేని మద్యం తాగి ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని కూటమి నాయకులు విస్తృత ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ మద్యాన్ని నిలిపివేసి బ్రాండెడ్ మద్యం తీసుకువస్తామని హామీలు గుప్పించారు. జూన్ 12వ తేదీన కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఇప్పటికీ పాత మద్యాన్నే విక్రయిస్తూ వచ్చింది. ఎన్నికలకు ముందు వరకు నాణ్యత లేని మద్యం తాగి ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆరోపణలు చేసిన కూటమి నేతలు.. ఇప్పటికీ అదే మద్యం విక్రయించడం గమనార్హం. కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటైన తరువాతైనా బ్రాండెడ్ మద్యం వస్తుందనుకుంటే.. ఇప్పుడు కూడా కొత్త బాటిళ్లలో పాత మద్యాన్నే విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ మద్యం తక్కువ ధరకు వస్తుందనుకుంటే.. పాత మద్యాన్నే ఎమ్మార్పీ కంటే క్వార్టర్‌కు రూ.20 అదనంగా విక్రయిస్తుండడం పట్ల మందుబాబులు మండిపడుతున్నారు. దీనిపై ఎక్సైజ్ అధికారులకు సైతం ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐలకు ఆదేశాలు అందాయి. అయితే ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేసు నమోదు కాకపోవడం గమనార్హం.

మెరుగైన వైద్యం అందించాలి

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

హుకుంపేట: వైద్యాధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆయన బొరపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న పౌష్టికాహార వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని సిబ్బందిని ఆదేశించారు. క్షయ నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కలిగి ఉంటే వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

దాడితో వ్యక్తి మృతి

- క్రికెట్ బాట్‌తో కొట్టడం వల్ల తన భర్త చనిపోయాడని భార్య పోలీసులకు ఫిర్యాదు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ సంతవీధి గ్రామానికి చెందిన వి.భీమలమ్మ అనే మహిళ తన భర్త వంతినిభ బాబూరావు(49)ను కొంతమంది క్రికెట్ బాట్‌తో కొట్టడంతో చనిపోయాడని శనివారం ఫిర్యారు చేసినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపా రు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతవీధి గ్రామంలో ఈ నెల 17న తన భర్త బాబురావును ఆదే గ్రామానికి చెందిన కిల్లో రాధాకృష్ణ అనే వ్యక్తి క్రికెట్ బాట్‌తో కొట్టడం, మరికొంత మంది దాడి చేయడంతో తీవ్ర గాయాలు కావడంతో ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో వైద్య సేవలు అందించి, పరిస్థితి విషయంగా ఉండడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించనట్టు పేర్కొన్నారు. శనివారం ఉదయం చికిత్స పొందుతూ తన భర్త మృతి చెందినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ తెలిపారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

గల్లంతైన గిరిజనుడి మృతదేహం లభ్యం



వేణుగోపాల్‌స్వామి మృతదేహం వద్ద ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, అధికారులు, కుటుంబ సభ్యులు

ముంచంగిపుట్టు: మత్స్యగెడ్డలో గల్లంతైన గిరిజనుడి మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన కొర్రా వేణుగోపాల్‌స్వామి మత్స్యగెడ్డలో పడవ బోల్తా పడటంతో గల్లంతవడం తెలిసిందే. రెండు రోజులుగా విశాఖకు చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ వైకుంఠం ఆధ్వర్యంలో 15 మందితో కూడిన బృందం సభ్యులు గాలింపు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం వేణుగోపాలస్వామి మృతదేహాన్ని మత్స్యగెడ్డలో గుర్తించి బయటకు తీశారు. అక్కడి నుంచి పెదబయలు మండలం సీతగుంట పంచాయితీ రోగులపేటకు తరలించారు. పోస్టు మార్టం చేసిన అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు తహసీల్దార్లు నర్సమ్మ, రంగారావు, ఎస్ఐలు రవీంద్ర, రమణ అప్పగించారు. భార్య లక్ష్మి, తల్లిదండ్రులు భీమన్న, సీతమ్మ రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచులు పాండురంగస్వామి, మాధవరావు, ఎంపీటీసీలు మల్లికార్జున్, బొజుబాబు కోరారు.

డోలీలో గర్భిణి తరలింపు

- తప్పిన ప్రాణాపాయం
- రహదారులు నిర్మించాలని వినతి

అనంతగిరి (అరకులోయ రూరల్): పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. మండలంలోని గుమ్మకోట పంచాయతీ కర్రిగుడ గ్రామానికి చెందిన గర్భిణి బడ్నాయిని రాములమ్మ శనివారం పురిటి నొప్పులు వచ్చాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆమెను బంధువులు కర్రిగుడ నుంచి నిమ్మూట వరకు సుమారు 8 కిలోమీటర్లు డోలీలో తరలించారు. అక్కడ నుంచి ప్రైవేట్ ఆటోలో ఎస్‌కోట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి రహదారి సౌకర్యం లేనందున ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కర్రిగుడ, నిమ్మఊట గ్రామాలకు ఉపాధి హామీ పథకంలో రహదారి మంజూరైందన్నారు. పనులు మధ్యస్తంగానే నిలిచిపోయాయని గ్రామస్తులు బొజ్జన్న, సన్యాసిరావు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రహదారిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొండ శిఖర గ్రామాల సమస్యను గుర్తించి రహదారులు నిర్మించాలని వారు కోరారు.

ముందస్తు చర్యలతో నష్ట నివారణ

- కలెక్టర్ దినేష్‌కుమార్
- విపత్తుల సమయంలో చేపట్టే కార్యక్రమాలపై సమావేశం

సాక్షి,పాడేరు: విపత్తుల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా నష్టాలను నివారించవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. పలుశాఖల అధికారులతో విపత్తుల సమయంలో చేపట్టే కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రణాళిక పరంగా చర్యలు చేపట్టాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, నిత్యావసరాలు, వైద్య ఆరోగ్య కార్యక్రమాలు అందుబాటులోకి తెస్తామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ప్రజల సమస్యలు తెలుసుకుని వెనువెంటనే పరిష్కార చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజలు కనీస అవసరాలు తీర్చడంలోను అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, డీఆర్‌వో పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ మురళీ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, వర్చువల్ విధానంలో యూనిసెఫ్ వాష్ స్పెషలిస్టు వెంకటేష్, టెక్నికల్ సహాయకులు నిర్మలరాణి, కాశేశ్వరరావు,తహసీల్దార్లు,ఎంపీడీవోలు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లను అరికట్టాలి

పాడేరు : ప్రభుత్వం సరఫరా చేయనున్న ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ కేవైసీ చేసుకోవాలంటే కచ్చితంగా గ్యాస్ పైపు కొనుగోలు చేయాలని పాడేరు ఇండేన్ గ్యాస్ గొడౌన్ సిబ్బంది అక్రమంగా రూ.200 సొమ్ము వసూలు చేస్తున్నట్టు ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యాదర్శి కూడా రాధకృష్ణ ఆరోపించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారులకు గ్యాస్ పైపు అవసరం లేకపోయినా కొనుగోలు చేస్తేనే కేవైసీ చేయమని గ్యాస్ గొడౌన్ సిబ్బంది ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె అనివార్యం

ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యాన్ని హెచ్చరించిన కాఫీ కార్మిక సంఘాలు



ఏపీఎఫ్‌డీసీ అధికారులతో చర్చలు జరుపుతున్న కాఫీ కార్మిక సంఘాల నాయకులు

చింతపల్లి: సమస్యలు పరిష్కరించడంలో ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం నాన్చివేత ధోరణి ప్రదర్శిస్తే సమ్మె తప్పదని కాఫీ కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కాఫీ కార్మికుల సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని ఇటీవల ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యానికి వారు నోటీసులు ఇవ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక ఏపీఎఫ్‌డీసీ డివిజన్ కార్యాలయంలో ఆ సంస్థకు చెందిన డివిజన్ మేనేజర్లు, సీనియర్ అధికారులు, ఉద్యోగులతో కాఫీ కార్మిక సంఘాల ప్రతినిధులు చిన్నయ్యపడాల్, బుజ్జిబాబు, కనకవల్లి, సుందరరావు సమావేశమయ్యారు. కాఫీ కార్మికుల సమస్యలను వారు వివరించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. లేకుంటే సమ్మె తప్పదని మరోసారి హెచ్చరించారు.కార్మికుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత తొందరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మేనేజర్లు రత్నమాల, కృష్ణబాబు, పూర్వ డీఎం మహేశ్వరరావు పాల్గొన్నారు.

వన్‌ధన్ వికాస కేంద్రాల బలోపేతానికి కృషి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలోని వన్‌ధన్ వికాస కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. పీవో తన చాంబర్‌లో శనివారం జీసీసీ, వెలుగు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని మహిళా సంఘాల సభ్యులు వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా అభివృద్ధి చెందేలా ఎప్పటికప్పుడు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. వెయ్యి మంది సభ్యులను గుర్తించి శిక్షణ ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే సీజన్‌లో పసుపు, చింతపండు, చీపుర్లు, జీడిమామిడి పిక్కలు, జాఫ్రా తదితర అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జీసీసీ డీఎం జి. పార్వతీశ్వరరావు, డీపీఎం అపర్ణ పాల్గొన్నారు.

కార్యదర్శిగా పరశురామ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న పరశురామ్

సీలేరు: జి.కె.వీధి మండలం సీలేరు పంచాయతీ నూతన కార్యదర్శిగా వంతల పరశురామ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాలకవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యదర్శిగా పరశురాం మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పాలకవర్గ నియమ నిబంధనల ప్రకారం వారితో సమావేశాలు నిర్వహించి తగు నిర్ణయాలు తీసుకున్నట్టు చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.

అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రతి ఒక్కరూ విధి నిర్వహణ సక్రమంగా చేయాలని, ఉన్నతాధికారులకు తగిన సమాచారాన్ని తక్షణమే అందించాలని సూచనలిచ్చారు. సర్పంచ్ దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి, కూటమి నాయకులు రాము, బాబు, మిండి, అప్పలరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, వెల్ఫేర్ అసిస్టెంట్ లోవ కుమారి, మహిళా పోలీసు రేవతి, డిజిటల్ అసిస్టెంట్ విజయ తదితరులు పాల్గొన్నారు.